


# పుట్టినరోజు

## మాదిరెడ్డి సులోచన

1980 యువ దీపావళి ప్రత్యేక సంచిక

**గోపీచంద్ ఇంటికి** వచ్చేసరికి రాధ అందంగా అలంకరించుకుని బయటి వరండాలో నిలబడింది. అతని కళ్ళు



ఆనందంతో రెప, రెపలాడాయి. రాధిక తను చెప్పాక, ఇంత త్వరగా తయారవుతుందనుకున్నాడా? తమ ఇద్దరి రాకకు లక్ష్మి యెంతో సంతోషిస్తుంది.

విది విచిత్రమైన నాటకాలు ఆడుతుంది. గోపీచంద్‌కు ఏమీలేనినాడు లక్ష్మి ఉన్న వారి అమ్మాయి. దూరపు బంధుత్వం ఉన్నా, స్వంత పిల్లల్లాగే పెరిగారు. పదవ తరగతి పరీక్షలు వ్రాయగానే తమ దారులు వేరయ్యాయి. లక్ష్మి తండ్రి వ్యాపారం దెబ్బ తిన్నది. గోపీచంద్ తండ్రికి ఉన్న పనికిరాని పొలాలు ఫ్యాక్టరీలకు తీసుకుని, ఊహించలేని డబ్బు ఇచ్చారు ప్రభుత్వం.

దాని ఫలితంగా గోపీచంద్ ఎం.కాం చేసి బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. క్రింది భాగంలో వచ్చిందని ఫ్లాట్ కొన్నాడు. స్కూటర్ ఉంది. అయినింటి ఆడపడుచు రాధ ఇల్లాలు అయింది.

లక్ష్మి తండ్రి కట్నం ఇవ్వలేక, అర్ధ యెకరం పొలం మిగిలిన ఓ రైతుకు కూతుర్నిచ్చాడు. లక్ష్మి భర్త ఆ అర్ధ ఎకరం అమ్మి కిళ్ళీ కొట్టు పెట్టాడు. లక్ష్మి 'గోపీ...గోపీ' అంటూ చనువుగా తిరిగితే రాధ దగ్గర బంధువులు, బాగా ఉన్నవారు అనుకుంది, పెళ్ళిలో.

లక్ష్మి భర్తకు కిళ్లీ కొట్టు వ్యాపారం అవి వినగానే ఆమెకు వికారం కలిగింది. భర్తను ఆ ఛాయలకు పోవద్దన్నది.

'లక్ష్మి చిన్నప్పుడు యువరాణిలా బ్రతికింది. కలిమిలేములు శాశ్వతం కాదు. కిళ్ళీ కొట్టు పెట్టుకోవటం నేరం కాదు" అని గోపిచంద్ ఎంత చెప్పినా రాధకు వినిపించలేదు.

లక్ష్మివాళ్ళు వచ్చినా ముభావంగా ఉండేది.

"బీరకాయపీచు చుట్టరికానికే పూసుకు తిరగాలా?" వాళ్ళు వెళ్ళాక ముఖం చిట్లించేది. లక్ష్మి స్నేహపాత్రురాలు అని రాధికకు తెలుసు. ఏ ఆఫీసరు భార్య అయితే యెంత బావుండేది.

"రాధీ! దూరం చుట్టమేకాని, చిన్నప్పుడు ఒకే తల్లి పిల్లల్లా పెరిగాము. నాకు స్నేహితురాలు" అన్నాడు గోపిచంద్. వాళ్ళ కుటుంబంలో తన స్థానం వివరించాడు.

"అబ్బ! స్నేహం చెయ్యటానికి మనుష్యులే దొరకలేదా, ఆ కిళ్ళీ కొట్టులో కూర్చుని చిల్లర సామాన్లు అమ్ముకునేవారు తప్ప" రాధిక విసుక్కుంది.

గోపిచంద్ ఉలిక్కిపడ్డాడు.

"రాధీ! వాళ్ళు దొంగతనం చెయ్యలేదు. స్వతంత్రంగా, సగర్వంగా బ్రతుకుతున్నారు" అన్నాడు.

"పేడ చేరవేసి పిడకలు కొట్టటం కూడా స్వతంత్రంగా బ్రతకడమేనా?" వెటకారంగా అడిగింది.

గోపిచంద్ చాలా బాధపడ్డాడు. ఇలాగే లక్ష్మిముందు అంటే ప్రమాదం. అందుకే లక్ష్మి ఇంటికి ఒంటరిగానే వెళ్ళేవాడు. ప్రతిసారి రాధికను తీసుకు రాలేదని లక్ష్మి నిష్ఠూరం ఆడేది. కాని తనేం చేయగలడు? బలవంతంగా యెవరిచేత పని చేయించటం ఇష్టం ఉండదు.

లక్ష్మికి వివాహమయిన ఆరేళ్ళకు కూతురు పుట్టింది. నామకరణోత్సవంలాంటివి ఊళ్ళోనే జరిపింది. మొన్నొక రోజు ఇంటికి వచ్చి, బొట్టు పెట్టి ఆహ్వానించింది, కూతురు పుట్టినరోజుట.

"ఈసారి తప్పించుకుంటే ఊరుకోను వదినా. మా గౌరిని మీరిద్దరు ఆశీర్వదిస్తేనే నాకు తృప్తి" అన్నది.

"నీకెందుకు లక్ష్మీ. రాధికను నా స్కూటర్ వెనుక సీటుకు కట్టి తీసుకు వస్తాను" హామీ ఇచ్చాడు గోపిచంద్.

ఉదయం అపర శ్రీకృష్ణుడై బ్రతిమాలాడు రాధికను.

"నాకు మీ లక్ష్మి అన్నా, ఆమె భర్త చేసే వ్యాపారమన్నా ఇష్టంలేదు. నాచేత ఇష్టంలేని పనులు యెందుకు చేయిస్తారు" అన్నది విసుగ్గా.

"నాకోసం రావాలి రాధీ. నేను వచ్చేవరకు తయారుగా ఉండు. అరగంట అలా వెళ్ళి, ఇలా వచ్చేద్దాం. ప్లీజ్ నువ్వు నా మాటకు విలువ ఇస్తావ్" అని అరగంట బ్రతిమాలి వెళ్ళాడు.

అతని భార్య దర్శనం శుభసూకంగా కనిపించింది.

"హాయ్ రాధా! మై స్వీట్ డార్లింగ్" అన్నాడు ఆనందంగా.

"అయితే కాఫీలోకి పంచదార వద్దన్నమాట" అన్నది నవ్వుతూ.

"ఈ పూట కారం పొడి కలిపినా త్రాగుతాను" అన్నాడు గోపి.

"ఏమండీ! మనం దారిలో కాసేపు ఆగి, షాపింగ్ చేయాలి. మా పిన్ని కూతురు కోమల తెలుసుగా.."

"అదేమైనా పిండి బొమ్మా..." అన్నాడు గోపిచంద్.

"ఆఁ..దాని కొడుకు పుట్టిన రోజుట ఈ రోజు. దారిలో వాడికో డ్రస్సు కొనుక్కుని, బొమ్మలు కొని, పార్టీ అయ్యాక మీ లక్ష్మి దగ్గరకు వెళ్దాం. అక్కడ పది నిమిషాల కంటే యెక్కువ ఉండలేను. మళ్ళీ నన్ను అనవద్దు" అన్నది.

"అబ్బ ప్రొద్దున అంతసేపు కొట్టిన మస్కాకు పది నిమిషాల గ్రాంటా! ఓ.కె ఏం చేస్తాం వచ్చే జన్మలో భార్యనయి సాధించి, చెబుతాను" అన్నాడు గోపి.

మరో పది నిమిషాలకు ఇద్దరూ స్కూటర్‌పై బయలుదేరారు. రాధిక ఆదేశానుసారం ఒక రెడీమేడ్ బట్టల షాపు ముందు ఆపాడు స్కూటర్ని.

"అలాగే లక్ష్మి కూతురికో చొక్కా కొందాం రాధీ" అన్నాడు.

"మీ ఇష్టం" అన్నది రాధిక. ఆమె తను కొనాలనుకున్న డ్రస్సు గంట ఎంపికచేసి కొన్నది. గిఫ్ట్ ప్యాక్ అందంగా చేయించింది.

"ఒక్క డ్రస్సు ఎంపిక చేయటానికింతసేపా?"

"మా కోమలది చాలా మంచి టేస్ట్. దానికేవి ఒక పట్టాన నచ్చవు" అన్నది బిల్ అందిస్తూ.

బిల్ చూశాడు. నలభై ఎనిమిది రూపాయలు. అంత యెక్కువగా అనిపించినా అతనేం మాట్లడలేదు. తెల్లదానిపై నీలం చుక్కలున్న ఫ్రాక్ ప్యాక్ చేయించాడు. ఇరవై ఒక్క రూపాయి అయింది. ఆమె పన్నెండు రూపాయలు పెట్టి ఓ రైలు బొమ్మ కొన్నది.

గోపిచంద్ గౌరికి ఏమన్నా కొనాలనుకుని, లక్ష్మి స్వభావం గుర్తుకు వచ్చి, తన ప్రయత్నం విరమించుకున్నాడు.

ఇద్దరూ కోమల ఇల్లు చేరారు.

బెలూన్లు, రంగు కాగితాలు కట్టిన హాల్లో, కుర్చీ పూలతో అలంకరించారు. ముందున్న స్టూలుపై పెద్ద కేకొకటి పెట్టారు. దానిపై క్యాండిల్స్ ఉన్నాయి.

దాదాపు వంద, రెండువందల మందిని పిలిచారు.

"హాయ్ రాధా..." అనేసి కోమల హడావుడిగా అక్కడ ఏర్పాట్లు చూడసాగింది.

ఇద్దరూ వెళ్ళి కూర్చున్నారు.

కోమల భర్తగారి ఆఫీసరు రాగానే కూర్చుని, కేక్ కోయించారు. పాటలు పాడారు. కాగితం ప్లేటు తెచ్చి, ఓ కేకుపీస్, మిక్చర్, అరటిపండు పెట్టి అందరికి ఇచ్చారు. తరువాత అందరికి థంబ్స్అప్ ఇచ్చారు. రాధికకు కోమలను ఒంటరిగా కలుసుకోవటం కుదరటంలేదు. బొమ్మలు, బిస్కట్ ప్యాకెట్లు అందరూ ఇస్తున్నారు.

కోమల కొడుకు అందంగా, తెల్లగా, బొద్దుగా, ముద్దొస్తున్నాడు. తను తెచ్చిన డ్రస్సులో వాడింకెంత బావుంటాడో ఊహించుకున్నది. వాడి నెత్తుకుని, ప్రక్కకు తీసుకువెళ్ళి తను తెచ్చిన డ్రస్సు వేసింది. నీలం నలుపు చారలతో వాడికి యెంతో నప్పింది. వాడిని ముద్దు పెట్టుకుంటుండగా హడావుడిగా వచ్చింది కోమల.

"కెంపూ! ఇక్కడున్నావా? అవతల డాడీ నీకోసం చూస్తున్నారు. అరే వాడి డ్రస్సెవరు మార్చారు?" అన్నది కోమల.

"నేనే కోమా! యెలా ఉంది ఈ డ్రస్సు? కెంపు క్యూట్‌గా లేడూ?"

"రాధీ! నీకు సమయా సమయాలు తెలియవు. వచ్చింది బిస్కెట్ ఫ్యాక్టరీ ఓనర్.. మైగాడ్.." కోమల వాడి షర్ట్ లాగి ఒక వైపు వేసింది వాడి చెడ్డీ లాగి రెండోవైపు వేసింది. ఇందాకటి ప్యాంటు, షర్ట్ తొడిగి బయటకు తీసుకు వెళ్ళింది.

ఆ బట్టల వంక దీనంగా చూసింది.

అవి తనను చూసి నవ్వినట్టు అనుభూతి పొందింది.

"నీవు ఒక్క గంట ఏరి తెచ్చినావే. ఒక్క నిమిషం నీ స్నేహితురాలు నీ వంక చూసిందా?" అని యెవరో ప్రశ్నించినట్టు అయ్యింది. నీలం, నలుపు చారలు తిరగవేయటంతో అసహ్యంగా కనిపించింది. నిజానికి కెంపుకు తను తెచ్చిన బట్టలు యెంతగానో నప్పాయి. రాధిక కళ్ళనీళ్ళు అదిమిపట్టి బయటికి వచ్చింది. యెవరి పరిచయస్తులతో వారు మాట్లాడుతున్నారు. గోపిచంద్ ఓ ప్రక్కకు నిలబడి గోడమీద వున్న కేలెండర్ల వంక చూస్తున్నాడు.

"వెళ్దామా?"

"అమ్మయ్య ఇంత త్వరగా తెమిలిందే" అన్నాడు అతను.

"పార్టీకి వచ్చి పడకవేస్తామా?" అన్నది కోపంగా.

కోపమెందుకో అర్థంకాలేదు.

"మీ కోమలతో చెప్పి వస్తావా?"

"అక్కరలేదు లెండి" అన్నది. ఇద్దరూ బయటికి వచ్చారు.

"గోపీ. నాకెందుకో తలనొప్పిగా ఉంది. నన్ను ఇంటి దగ్గర డ్రాప్‌చేసి నువ్వు లక్ష్మి వాళ్ళింటికి వెళ్ళు" అన్నది వేడికోలుగా.

"చూడు రాధీ! ఈ ఒక్కసారికి నా మాట మన్నించు, ప్లీజ్. అయిదారు నిమిషాలకంటే యెక్కువ కూర్చోవద్దు. ఒక పార్టీకి వెళ్ళామని చెబుతాను" అన్నాడు.

మొండిగా వాదించే ఇష్టంలేదు. అతని వెనుకాల యెక్కి కూర్చుంది.

"నువ్వు తెచ్చావుటె, ఎంతో బావుంది" అలా అనకపోయినా 'బావుందే' అంటే తను ఉప్పొంగి పోయేది 'ఛ...ఛ దానిపనిలో అది ఉంది ' అనుకోబోయింది. వాళ్ళాయన ఆఫీసరు తెచ్చిన బొమ్మచూచి కోమల అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఓ బ్యూటిఫుల్! యెంత బావుందో అంకుల్‌కు థాంక్స్ చెప్పమ్మా ' అని వయ్యారంగా అనటం తను విన్నది.

'ఛీ...ఛీ.. తనకేమయింది! ఆఫీసరు దగ్గర నటించక తప్పదు. తను స్నేహితురాలు. తన దగ్గర నటించటం భావ్యమా?' అనుకుంది కాని ఆమె మనసంతా చేదు మింగినట్టుంది. సున్నితమైన చోట దెబ్బ తాకింది.

"ఏమిటి స్కూటర్ దిగవా?" భర్త అడిగేసరికి చటుక్కున స్కూటర్ దిగిందామె.

"వచ్చారా అన్నయ్యా! గౌరి నిదురపోతుందేమోనని భయపడుతున్నాను. రా వదినా. స్వాగతం..సుస్వాగతం" అన్నది లక్ష్మి.

శ్రీహరి కూతుర్ని తీసుకుని వచ్చాడు.

"రామ్మా రాధికా.." అతను చిన్నగా నవ్వాడు. పాప బుట్టబొమ్మలా నైలాన్ చొక్కా వేసుకుంది. చేతులకు ప్లాస్టిక్ గాజులు, కళ్ళనిండుగా కాటుకతో చిరునవ్వులు చిందిస్తుంది గౌరి.

ఇద్దరు ఇంట్లోకి వెళ్ళారు. పదిమంది దగ్గరివారే ఉన్నారు.

"విత్ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ద డే.." అని, అతను ఫ్రాక్ ఇచ్చాడు గౌరికి.

ఆ పిల్ల అది గట్టిగా కడుపుకు అదుముకున్నది.

"హారతి ఇచ్చెయ్యమ్మా" శ్రీహరి తల్లి కుందులు వెలిగించింది.

లక్ష్మి పొట్లం విప్పింది. ఆమె కళ్ళు ప్రశంసతో మిలమిలలాడాయి.

"గోపీ! ఇది నీ టేస్ట్ అనుకోను. రాధిక ఎన్నికచేసింది కదూ. చాలా బావుంది రాధికా" అన్నది నవ్వుతూ.

"యెవరు ఎన్నిక చేస్తేనేం? నీకు నచ్చింది చాలు" అన్నాడు గోపి.

రాధికకు ఒక్కసారి ప్రాణం లేచివచ్చినట్టు అయింది.

"వేసి చూడనా?" అన్నది రాధిక.

"అయ్యో అంత కంటేనా నీకేం సొగసు బలిసిందే తల్లీ. మూడు గౌన్లు మార్చావ్" అంటూ కూతుర్ని రాధికకు ఇచ్చింది.

గౌను వేసాక అందరూ బావుందన్నారు. పాపకు హారతిచ్చి అక్షింతలు వేశారు.

"ఇక మేము వెళ్ళి వస్తాం లక్ష్మీ" గోపీచంద్ లేచాడు.

"బావుందన్నయ్యా! భోజనం చెయ్యకుండా వెళ్ళనిస్తానేంటి? హోం డిపార్ట్‌మెంటు వదినది. ఏమ్మా?" అడిగింది లక్ష్మి .

గోపీచంద్‌కు లక్ష్మి పై కోపం వచ్చింది మొహమాట పెట్టేస్తుందని, రాధిక ఏమంటుందోనని భయం.

"అలాగే భోజనం చెయ్యమంటే కాదంటానా?" అన్నది రాధిక.

గోపీచంద్ చెయ్యి గిల్లి చూసుకున్నాడు. శ్రీహరి తల్లి వడ్డించగా అందరూ భోజనాలు చేసారు.

అరిటాకులో అన్నం, వంకాయ వేపుడు, దోసకాయ పప్పు, దొండకాయ పెరుగుపచ్చడి వడ్డించింది. ఆఖర్న పాయసం కూడా ఉంది. ఆడంబరంలేక, రుచిగా, సుచిగా ఉన్న పదార్ధాలను అందరూ ఇష్టంగా తిన్నారు.

ఆప్యాయంగా విసురుకునే మాటలతో హాస్యపు జల్లు కురిసినట్టు అయ్యింది. భోజనంతోపాటు అరమరికలు లేని ఆప్యాయత, కొసరి వడ్డించడం, కడుపుతో పాటు మనసు నిండిపోయింది రాధికకు. ఉక్కిరిబిక్కిరి చేసే ఉక్కనుండి చల్లగా వీచే మలయమారుతంతో వచ్చిన అనుభూతి పొందింది రాధిక.

"మీరు కూర్చోండి పెద్దమ్మా! నేను వడ్డిస్తాను" అన్నది రాధిక.

మరోసారి కలా, ఇలా అన్నట్టు భార్యవంక చూచాడు గోపిచంద్.

"యెందుకమ్మా..." అని శ్రీహరి తల్లి అంటున్నా వినకుండా ఆమెకు ఆకువేసి వడ్డించింది రాధిక.

"అయ్యో చాలమ్మా చాలు.." ఆవిడ కంగారుగా చెయ్యి అడ్డం పెట్టింది.

"బావుంది పెద్దమ్మా, మాకు వడ్డించలేదా?" అన్నది నవ్వుతూ.

"మీదంటే, ఏది తిన్నా అరిగించుకునే వయసమ్మా. రుచిగా ఉందని ఒక్క ముద్ద యెక్కువ తిన్నా రాత్రంతా బాధపడాలి" అన్నదామె. రాధిక లక్ష్మి కి అన్ని సర్దటంలో సాయంచేసింది. లక్ష్మి గలగల కబుర్లు చెప్పింది.

"నిజంగా గోపీ నువ్వు చాలా తెలివి మీరిపోయావు. వదిన్ని తీసుకువస్తే మేం కలిసిపోతామనే కదా, సాకులు పెట్టి, తప్పించుకున్నావ్. నిజంగా యెంత సరళ స్వభావురాలు రాధిక" అన్నది లక్ష్మి అందరికి తాంబూలం ఇస్తూ.

"క్షణ, క్షణము జవరాండ్ర చిత్తముల్" అన్నట్టు మీ స్వభావాలను అర్ధంచేసుకోవటం ఆ ఆదిదేవునికే తెలియదు. నేనెంత తల్లీ" అన్నాడు గోపిచంద్

రాధిక ముసిముసిగా నవ్వింది.

"నిజం రాధికా! ఈ పూట నువ్వు రావటం నాకెంతో ఆనందంగా ఉంది. నిండుగా ఉంది" అన్నది ఆనందంతో.

రాధికకు ఒక్కసారి కళ్ళముందు మెరుపు మెరిసినట్టు అయ్యింది. యెంత మధురమైన అనుభూతి. యెంత చక్కని కాంప్లిమెంటు. వ్యక్తి జీవించటానికి ఇలాంటి అనుభూతులు అవసరం అనుకుంది. "అమ్మో ! లక్ష్మీ ఏం సమ్మోహనాస్త్రం వేసావ్ తల్లీ. పది నిమిషాలుంటామని వచ్చాం. పదిన్నర గంటలయ్యింది" అన్నాడు టైం చూసుకుని గోపిచంద్.

"రోజూ ఉండరుగా" అన్నాడు శ్రీహరి.

మరో పదినిమిషాలకు భార్యాభర్తలు బయలుదేరారు. ఇంట్లోని వారంతా వాకిట్లోకి వచ్చి, నవ్వుతూ ఆప్యాయంగా సాగనంపారు. అందరి ముఖాలు ప్రసన్నంగా ఉన్నాయి. వారి రుణం ఏమిచ్చి తీర్చుకోగలను అనుకుంది. లక్షి  ఆకు, అరటిపండు, లడ్డు పొట్లం చేతిలో పెట్టింది.

గోపిచంద్ తన భుజం యెప్పుడు గిల్లుతుందోననిని ఊపిరి బిగబట్టాడు. అయిదు నిమిషాలని అరగంట చేస్తే స్కూటర్ యెక్కగానే రాధిక చేసే మొదటి పని అది. ఇల్లు చేరినా అలాంటి ప్రమాదం జరగలేదు."

"అమ్మయ్య.." అనుకున్నాడు. అతను స్కూటర్ పార్క్ చేసి, తాళం వేసి, బయటి తలపులు వేసి వచ్చేసరికి, లడ్డూ ముక్క తుంపి, అతని నోట్లో పెట్టింది.

ఉక్కిరిబిక్కిరి అయి ఆ ముక్క తినేశాడు.

"రాధీ! కడుపునిండా తిన్నాను. మళ్ళీ ఈ బలవంతం ఏమిటి? రేపు తిందాం పెట్టెయ్యవోయ్" అన్నాడు.

"ఉహూ! నా పుట్టినరోజు స్వీట్ తినాలి" అన్నది. ఆమె కళ్ళు మిలమిలమెరుస్తున్నాయి.

"ఏమిటి నీ పుట్టినరోజు! రాధీ డియర్ నీకేమయింది?" అన్నాడు కంగారుగా. అతనికి బాగా గుర్తు. వాళ్ళ పెళ్ళి రోజు పుట్టినరోజు ఒకదాని వెంట ఒకటి వస్తాయి. మళ్ళీ ఈరోజు పుట్టిన రోజు అంటుందే రాధిక. భర్త అవస్త గమనించి పకపక నవ్వింది. అంతలోకే గంభీరంగా మారిపోయింది.

గోపిచంద్ నిజంగా భయంగా చూచాడు.

"నా పుట్టినరోజు మన పెళ్ళి అయిన మరురోజు అని తెలుసు. మనిషిగా  పుట్టినరోజు ఈ రోజండి. పెద్ద, పెద్ద ఉపన్యాసాలు తేలేని మార్పు, ఒక్క చిన్న సంఘటన తెస్తుందండీ. ఆడంబరమే అనుభూతని, ధనికులే గొప్పవారని, హంగులే ముఖ్యమనుకున్న నాకు ఒక చిన్న సంఘటన కళ్ళు తెరిపించింది." అన్నది స్వప్నంలో నడుస్తున్నట్టు, నడుస్తూ.

"ఏమిటి రాధీ... ఏమిటది?" ఆమె భుజాలు పట్టి ఆపాడు.

"మీరు ఒకనాడు అన్నారు గుర్తుందా. మనకంటే క్రిందివారిని చూడు రాధీ అంటూ. నిజమేనండి. మన అవసరం వారికి ఉంటుంది. మన రాక వారికి ఆనందం కలిగిస్తుంది. మన బహుమతి వారికి విలువయింది" అన్నది యెటో చూస్తూ.

"రాధీ..."

"నాకేం మతిపోలేదు" నవ్వింది. ఏం జరిగిందని అతను అడిగాడు. కాని ఆమె చెప్పలేకపోయింది. అతనికి చాలా సిల్లీగా అనిపించవచ్చు. యెంత వద్దనుకున్నా ఆమె కళ్ళముందు తిరగవేసిన డ్రస్సు కనిపించింది. అది చాలా చిన్నదే కావచ్చు కాని ఆమె మనసు సున్నితమైన చోట దెబ్బ తిన్నది.

నిజంగా కోమలది తప్పుకాదన్నది రాధికకు తెలుసు. అయినా ఆత్మీయురాలు నుండి ఒక్క ప్రశంసా వాక్యానికై పరితపించి పోయింది. గోపిచంద్‌కు మతిపోయినట్టు అయింది. అయినా భార్య మనస్తత్వం తెలిసినవాడు కాబట్టి స్పోర్టివ్‌గా, ఆమె పాలభాగం చుంబించాడు.

"ఇదేనోయ్, పుట్టినరోజు కనుక" అన్నాడు.

"కానుకలు ఖరీదుతో కొలవరు శ్రీవారు, అనుభూతులతో.." అనబోయింది. అతను యెలాంటి ఉపన్యాసం వినదలుచుకోలేదు. ఆమె వాక్ ప్రవాహానికి ఆనకట్ట వేసాడు.

COMMENTS